క్లుప్తంగా

రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు డిగ్రీ కళాశాల విద్యార్థి



ఉదయగిరి రూరల్: పట్టణంలోని మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి షేక్ మహమ్మద్ జావిద్ రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు ఎంపికయ్యాడు. గత నెలలో కళాశాలలో సమాచార హక్కు చట్టంపై నిర్వహించిన పోటీల్లో పాల్గొన్న జావిద్ ప్రతిభకనబరిచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. అనంతరం జిల్లాస్థాయి, జోనల్ స్థాయి పోటీల్లోనూ రాణించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. ఈ నెల 11న నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్న జావిద్‌ను ప్రిన్సిపల్ ఎల్ నారాయణస్వామి, వైస్‌ప్రిన్సిపల్ నరసింహులు, అధ్యాపకులు విక్రమ్, వెంకటేష్ గురువారం అభినందించి బహుమతులు అందజేశారు.

13లోగా భవన నిర్మాణాలను పూర్తిచేయాలి



ఉదయగిరి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో చేపడతున్న అదనపు తరగతి గదుల తుది మెరుగు పనులను సమగ్ర శిక్ష జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పీ వెంకటసుబ్బయ్య గురువారం పరిశీలించారు. ఈ నెల 13వ లోగా పనులను పూర్తి చేసి స్వాతంత్ర్య దినోత్సవం నాడు నూతన భవనాల వద్ద జాతీయ జెండాకు వందనం సమర్పించాలన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్స్ అథెంటిఫికేషన్‌ను నూరు శాతం పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట ఎంఈఓ-2 తోట శ్రీనివాసులు ఉన్నారు.

చెట్లను సంరక్షించుకోవాలి



చెట్టుకు రాఖీలు కట్టిన విద్యార్థులు

సోమశిల: పర్యావరణ పరిరక్షణలో ప్రధాన పాత్ర పోషించే చెట్లను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైన ఉందని ఉపాధ్యాయుడు చల్లా చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. అనంతసాగరం మండలం చిలకలమర్రి జెడ్పీ ఉన్నత పాఠశాలలో వృక్షాబంధన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. చెట్లకు రాఖీలు కడదాం- ప్రకృతిని కాపాడుకుందాం అంటూ విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులకు చెట్లకు రాఖీలు కట్టి ప్రతిజ్ఞ చేశారు. ఉపాధ్యాయులు మహేష్, ధనుంజయ, రమణరాజు, మదీనా, మాధవి, నాగ మురళి, పెద్దయ్య పాల్గొన్నారు.

ఉదయగిరిలో భారీ వర్షం



వరికుంటపాడు: గాలికి విరిగి ట్రాన్స్‌ఫార్మర్ మీదపడిన చెట్టు

వరికుంటపాడు/ఉదయగిరి: ఉదయగిరి, వరికుంటపాడు మండలాల్లో గురువారం భారీ వర్షం కురిసింది. సాయంత్రం వేళ ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని ఆకాశం మేఘావృతమై సాయంత్రం ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. బలమైన గాలులు వీయడంతో పలుచోట్ల చెట్లు విరిగిపడ్డాయి. వరికుంటపాడు మండలం భోగ్యంవారిపల్లి సమీపంలో పెద్ద చెట్టు విరిగి 11కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మీద పడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కాగా ఉదయం నుంచి ఎండవేడి, ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు కాస్తా సేద తీరారు. వర్షం మెట్టపంటల సాగుకు దుక్కులు చేసుకునేందుకు అనుకూలంగా ఉంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

విజయ డెయిరీ పార్లర్ ప్రారంభం



అల్లూరు: అల్లూరుపేటలో విజయ డెయిరీ పార్లర్‌ను విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి గురువారం ప్రారంభించారు. తన సొంత మండలంలో విజయ డెయిరీ పార్లర్‌ను శ్రీసూర్యచంద్ర ప్రారంభించడం సంతోషకరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణమోహన్, డైరెక్టర్ ఎస్ దశరథరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కిలో పొగాకు సగటు ధర రూ. 206

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గురువారం కిలో పొగాకు సగటు ధర రూ.206 పలికింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 396 బేళ్లను అమ్మకానికి తీసుకురాగా, 227 బేళ్లను కొనుగోలు చేశారు. కిలో పొగాకు గరిష్టంగా రూ. 280, కనిష్టంగా రూ. 150, సగటున రూ.206.18 ధర పలికిందని వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

ఎన్‌ఎంఎంఎస్‌తో

బినామీ మస్టర్లకు చెక్

- ఇక ఉపాధి కూలీలకు ముఖఆధారిత హాజరు
- ఈ నెల 10 నుంచి కొత్త యాప్ ద్వారా నమోదు
- రోజుకు రెండు పర్యాయాలు ఫొటోలు తీయాల్సిందే
- క్షేత్ర సహాయకుల గుండెల్లో గుబులు



జలదంకి మండలంలో ఉపాధి పనులు చేపడుతున్న కూలీలు(ఫైల్)

జలదంకి: ఉపాధి హామీ పనుల్లో పారదర్శకతకు కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. క్షేత్రస్థాయిలో జరిగే అవినీతికి చెక్ పెట్టేందుకు సాంకేతికతను అందిపుచ్చుకుంటోంది. ఉపాధి ఫలాలను అర్హులకు అందించాలనే సంకల్పంతో నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం పేరుతో నూతన యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ నెల 10 నుంచి కొత్త యాప్ ద్వారా ముఖఆధారిత హాజరు విధానాన్ని ప్రారంభిస్తోంది. దీంతో బినామీ, బోగస్ మస్టర్లతో ఉపాధి నిధుల స్వాహాకు చెక్ పడనుంది.

అత్యాధునిక సాంకేతికతతో..

ఉపాధి హామీ పథకంలో బోగస్, బినామీ మస్టర్లతో క్షేత్రసహాయకులు పెద్ద ఎత్తు నిధులు స్వాహా చేస్తుండడాన్ని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. అందులో భాగంగా అత్యాధునిక సాంకేతికతతో ఎన్‌ఎంఎంఎస్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ యాప్‌ను గ్రామ, మండల, జిల్లా భౌగోళిక పరిస్థితిని సైతం అంచనా వేసేలా రూపొందించారు. ఇందులో గ్రామాల్లో చేపడుతున్న పనులకు సంబంధించిన ఫొటోలను ప్రతిరోజూ అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అలాగే జాబ్‌కార్డు కలిగిన కూలీల ఫొటోలను ముందస్తుగా అప్‌లోడ్ చేస్తారు. ఉపాధి పనులకు కూలీలు హాజరైన సమయంలో యాప్ ద్వారా ప్రతిఒక్కరి ఫొటో (ఐరీష్) తీయాలి. ఒకవేళ యాప్‌లో నమోదు చేసిన వ్యక్తి ఫొటోతో మ్యాచ్ అవ్వకుంటే నగదు చెల్లింపులు చేసేందుకు వీలుండదు. ఈ ప్రక్రియ ఒకరి బదులు మరొకరు పనులకు రాకుండా తోడ్పడుతుంది. అలాగే బోగస్ మస్టర్లకు అడ్డుకట్ట వేస్తుంది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 10 నుంచి యాప్‌ను ప్రవేశపెట్టేందుకు మండలాధికారులు తమ పరిధిలోని టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లకు శిక్షణ ఇస్తున్నారు. అలాగే ఉపాధి ఏపీఓలు పనులు జరిగే ప్రాంతాల్లో కూలీలకు యాప్‌పై అవగాహన కల్పించే కార్యక్రమాలను చేపడుతున్నారు.

హాజరు ఇలా..

ఉపాధి కూలీల హాజరు తీసుకునే విధానంలో కొత్త పద్ధతి ముఖ ఆధారిత హాజరును కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. కూలీల ఫొటోలను సెల్‌ఫోన్‌లో తీసుకుని ఎన్‌ఎంఎంఎస్‌కు అనుసంధానం చేయాల్సి ఉంటుంది. పని ప్రదేశంలో రెండు సార్లు ఫీల్డ్ అసిస్టెంట్లు ఫొటోలను తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఈ సమయంలో ఒకరికి బదులు మరొకరు హాజరైనట్లు చూపితే ఆన్‌లైన్‌లో హాజరు తీసుకోదు.

అవకతవకలకు కళ్లెం



ఉపాధి పనుల్లో బోగస్ మస్టర్లను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్తగా ఎన్‌ఎంఎంఎస్ యాప్‌ను తీసుకొచ్చింది. ఈ నెల 10 నుంచి యాప్‌ను ప్రారంభించనున్నాం. దీంతో ఉపాధి పనులు జరిగే చోట ఎలాంటి అవకతవకలకు అవకాశం ఉండదు. కూలీలు ఒకరికి బదులు మరొకరు పని చేస్తున్నారనే విమర్శలకు కళ్లెం పడుతుంది. పని జరిగే చోట నాలుగు దిక్కుల్లో ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

– సీహెచ్ శ్రీనివాసులు, ఏపీఓ, జలదంకి

రెండు సార్లు నమోదు చేస్తేనే..

ఉపాధి పనులకు కూలీలు హాజరైన సమయంలో మొదటి ఫొటోను ఉదయం 6 గంటలకు తీసి అప్‌లోడ్ చేస్తే నాలుగు గంటల తరువాత అంటే ఉదయం 10 గంటలకు మరోసారి ఫొటోను అప్‌లోడ్ చేయాలని సిగ్నల్ వస్తుంది. ఉదయం 6 గంటలకు తీసిన ఫొటోతో పాటు 10 గంటలకు తీసిన ఫొటోను అప్‌లోడ్ చేయాలి. అలా చేయకపోతే ఆ రోజు కూలీలకు నగదు చెల్లింపులు ఉండవు. ఈ విధానం వలన గతంలో మస్టర్లలో గోల్‌మాల్ చేసేవారికి ఇబ్బందులు తప్పవు. గతంలో కూలీలు పనులకు రాకపోయినా మస్టర్లు వేయడం, తమ బంధువుల పేర్లు నమోదు చేసి వారు పనులకు రాకపోయినా నగదు తీసుకుంటూ క్షేత్రసహాయకులు దోచుకున్న ఘటనలు ఉన్నాయి. అయితే కొత్తయాప్‌తో వాటికి గండి పడే పరిస్థితి ఉంది. కాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీడీపీ నాయకులు గతంలో ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించి తమకు అనుకూలంగా ఉన్న వారిని నియమించుకుని ఉపాధి పనుల్లో అక్రమాలకు పాల్పడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం కొత్త యాప్‌ను తీసుకురావడంతో వారి గొంతులో పచ్చి వెలక్కాయ పడినట్టైంది.

సన్మానం



కలిగిరి: మండలంలోని వెలగపాడు గ్రామ సచివాలయంలో విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్లిన సచివాలయ సిబ్బందిని స్థానికులు గురువారం ఘనంగా సత్కరించారు. ఎంపీటీసీ సభ్యుడు గాలి రమణయ్య, వెలగపాడు, కావలిముస్తాపురం సర్పంచ్‌లు దేవనబోయిన వెంకటసుబ్బయ్య, పోలవరపు సుబ్బానాయుడు, ఎంపీడీఓ కార్యాలయ సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు గోపినాథ్, దీక్షితులు, పంచాయతీ కార్యదర్శి తనూజ, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన తల్లిపాల వారోత్సవాలు



వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో తల్లిపాల వారోత్సవాలు ముగింపు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. సీడీపీఓ పద్మజకుమారి బాలింతలు,గర్భిణులకు తల్లిపాల విశిష్టత, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తేజశ్వని, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటసుబ్బయ్య, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు లచ్చన్న

ఉదయగిరి: జిల్లాలోని వీఆర్‌ఏలు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు లచ్చన్న డిమాండ్ చేశారు. మండల వీఆర్‌ఏల సమావేశాన్ని గురువారం నిర్వహించారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో జరిగిన ఈ సమావేశంలో లచ్చన్న మాట్లాడుతూ ప్రభుత్వాలు ఎన్ని మారినా, పాలకులు ఎంత మంది వచ్చినా ఇంత వరకు వీఆర్‌ఏల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. అర్హులైన వీఆర్‌ఏలకు వీఆర్వోలుగా పదోన్నతి కలించాలని, పేస్కేల్‌ను అమలు చేయాలని, నామినీలను వీఆర్‌ఏలుగా గుర్తించాలని కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఏలకు కేటాయించిన అదనపు డ్యూటీలను రద్దు చేయాలన్నారు. అనంతరం మండల నూతన కమిటీని ఎంపిక చేశారు. గౌరవాధ్యక్షుడిగా దుర్గయ్య, అధ్యక్షుడిగా షేక్ ఫరీద్, ఉపాధ్యక్షుడిగా షేక్ హజరత్, ప్రధాన కార్యదర్శిగా హుస్సేన్‌బాషా, కోశాధికారిగా వెంగయ్యను ఎంపిక చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు నారాయణ, బాలు, ప్రధాన కార్యదర్శి ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగు లాభదాయకం



ఆయిల్‌పామ్ మొక్కలు నాటుతున్న ఉద్యాన అధికారులు

వింజమూరు(ఉదయగిరి): ఆయిల్‌పామ్ సాగు లాభదాయకమని జిల్లా ఉద్యానశాఖ అధికారి ఎంవీ సుబ్బారెడ్డి తెలిపారు. వింజమూరులో త్రీఎఫ్ ఆయిల్‌పామ్ కంపెనీ, జిల్లా ఉద్యాన శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పెరుగుతున్న పెట్టుబడులు, మార్కెట్లో నిలకడ లేని ధరల కారణంగా రైతులు వ్యవసాయంలో నష్టాలను చవిచూస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతులు ఆయిల్‌పామ్ సాగు చేపట్టడం ద్వారా నిలకడగా ఆదాయాన్ని పొందే అవకాశం ఉందన్నారు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 1200 హెక్టార్లలో సాగు చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాది కలిగిరి మండలం కొత్తపేటలో పామాయిల్ ఫ్యాక్టరీ అందుబాటులోకి వస్తుందన్నారు. ప్రస్తుతం దుత్తలూరు, వింజమూరుల్లో కలెక్షన్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం నూరు శాతం సబ్సిడీపై మొక్కలను ఇస్తున్నందున రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఆదర్శ రైతు కొంకల రామచంద్రారెడ్డిని సన్మానించారు. ఆయిల్‌పామ్ మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఉద్యాన అధికారిణి అనురాధ, జెడ్పీటీసీ గణపం బాలకృష్ణారెడ్డి,సర్పంచ్ సృజన, ఉదయగిరి, వింజమూరు ఉద్యానశాఖ అధికారులు జయశ్రీ, షహీల్, ఏఓ వాసు, త్రీఎఫ్ కంపెనీ ఏజీఎం సూర్యనారాయణ పాల్గొన్నారు.

న్యాయం చేయాలని గిరిజనుల వినతి



వింజమూరు(ఉదయగిరి): గతంలో ప్రభుత్వం మంజూరు చేసిన భూములు తమకే దక్కేలా చర్యలు తీసుకుని న్యాయం చేయాలని వింజమూరులోని జీబీకేఆర్ ఎస్టీ కాలనీ వాసులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ షేక్ హామీద్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో ప్రభుత్వం తమ కాలనీకి సమీపంలో ఉన్న భూములను లీజు పట్టాలుగా ఇవ్వగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం ఈ భూములను నుడాకు కేటాయించేందుకు ఆర్డీఓ పరిశీలన చేశారని, భూములు కోల్పోతే తమ జీవితాలు రోడ్డున పడుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన తహసీల్దార్ మాట్లాడుతూ 2010లో ప్రభుత్వం లీజు పట్టాలను రద్దు చేసి అనాధీన భూమిగా మార్చిందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆధీనంలో భూమి ఉన్నందున ప్రజావసరాల కోసం వినియోగిస్తోందన్నారు. మీ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని తెలిపారు.

పీఎం సూర్యఘర్ పథకంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కే బాలచంద్ర

ఆత్మకూరు: పట్టణంలోని మున్సిపల్ బస్టాండ్ ఆవరణలో పీఎం సూర్యఘర్ పథకంపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఆత్మకూరు విద్యుత్ శాఖ డీఈ భానునాయక్, ఏడీఈ చిన్నస్వామినాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో జిల్లా విద్యుత్‌శాఖ కార్యాలయం పీఈటీ కే బాలచంద్ర పాల్గొని సోలార్ విద్యుత్ ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. గృహాలపై సోలార్ విద్యుత్ పలకలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ బిల్లులను భారీగా ఆదా చేసుకోవచ్చని తెలిపారు. మిగులు సోలార్ విద్యుత్‌ను విక్రయించడం ద్వారా ఆదాయం వస్తుందన్నారు. సోలార్ పలకలను ఏర్పాటు చేసుకునే వారికి కేంద్ర ప్రభుత్వం సూర్యఘర్ పథకం కింద 1కేవీకి రూ.30వేలు, 2కేవీకి రూ.60వేలు సబ్సిడీని అందజేస్తుందని తెలిపారు. బ్యాంకులు సైతం రుణ సదుపాయాన్ని అందజేస్తాయన్నారు. ఆసక్తి కలిగిన వారు పట్టణంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కలిగిరి డీఈ కృష్ణమోహన్, పట్టణ ఏఈ జమీలాబేగం, రూరల్ ఏఈలు, సోలార్ సిస్టమ్ ఎండీ పీ మధు, సిబ్బంది, చైతన్య, రసూల్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితాలు చిత్తు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ వేమారెడ్డి

సంగం: మత్తు పదార్థాలతో జీవితాలు నాశనమవుతాయని, విద్యార్థులు వాటికి దూరంగా ఉండాలని సంగం సీఐ వేమారెడ్డి సూచించారు. స్థానిక నేతాజీ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు మాదక ద్రవ్యాలతో తలెత్తే అనర్థాలపై ఎస్సై రాజేష్‌తో కలిసి సీఐ గురువారం అవగాహన కల్పించారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు సహకరించాలన్నారు. బైక్‌ను నడిపే సమయంలో హెల్మెట్ ధరించాలని, అతివేగంగా నడపొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ మదార్‌బాషా పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు ప్రారంభం



పెన్నానది నుంచి కలశ జలాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు



కంకణధారణ చేస్తున్న వేదపండితులు

సంగం : పెరమనలో నూతనంగా నిర్మించిన అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు గురు వారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడ్రో జుల పాటు నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు వేద పండితుల ఆధ్వర్యంలో గణపతి పూజ, పుణ్యాహ వచనం, రక్షాబంధనం, తదితర పూజలు నిర్వహించారు. లలితా సహస్రనామ, విష్ణుసహస్రనామ పారాయణం చేశారు. అనంతరం భక్తులు పెన్నానది వద్ద నుంచి కలశ జలాలను ఊరేగింపుగా తీసుకొచ్చారు. మాజీ ఎంపీపీ దగుమాటి కామాక్షమ్మ, మధురెడ్డి దంపతులు, మాజీ సర్పంచ్‌లు బసిరెడ్డి, మధుసూదనయ్య, తదితరులు పాల్గొన్నారు.

దళిత మహిళపై దాడి హేయం



బాధితురాలిని పరామర్శిస్తున్న నాయకులు

ఆత్మకూరు: చేజర్ల మండలం మడపల్లి ఎస్సీకాలనీకి చెందిన వసంతమ్మపై టీడీపీ నాయకులు నరసారెడ్డి, ఈగా సుబ్బారెడ్డి, నారాయణరెడ్డి దాడి చేసి గాయపరచడం హేయమని కేవీపీఎస్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఖండించారు. మడపల్లిలో పెన్నా నది ఒడ్డున ఉన్న సర్వేనంబర్ 1234లోని రెండెకరాల భూమిని వసంతమ్మ పదిహేనేళ్లుగా సాగుచేసుకుంటోంది. ఈ భూమి తమదంటూ ఆమెతో గ్రామానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు తరచూ గొడవలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో రెండ్రోజుల క్రితం వసంతమ్మ పొలంలో కూరగాయలను సాగుచేస్తుండగా ట్రాక్టర్‌తో దున్నేశారు. అడ్డుకోబోయిన వసంతమ్మపై దాడి చేసి గాయపరిచారు. తన పొలం సొంతం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్న వారిపై రెవెన్యూ, పోలీసు అధికారులకు బాధితురాలు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోగా తిరిగి ఆమెపైనే కేసులు కట్టారు. దీంతో ఆమె మనస్తాపంతో బుధవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బంధువులు ఆత్మకూరులోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో వసంతమ్మను కేవీపీఎస్, వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాడి ఘటనపై అధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధితురాలికి న్యాయం చేయాలని, పొలం కాజేయాలని చూస్తున్న వారిపై అట్రాసిటి కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు మంగళ పుల్లయ్య, ఎస్ రఘురామయ్య, ఆలూరు తిరుపాలు, కే వెంకట రాజు, నాగయ్య, డేవిడ్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై బత్తల అలుపెరగని పోరాటం



మర్రిపాడు: కార్మిక, కర్షకుల సమస్యలపై బత్తల ఎరుకలయ్య అలుపెరగని పోరాటం సాగించారని సీపీఎం జిల్లా కమిటీ మాజీ సభ్యుడు బత్తల కృష్ణయ్య పేర్కొన్నారు. మండంలోని ఇసుకపల్లిలో కామ్రేడ్ ఎరుకులయ్య వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ ఎరుకులయ్య ఇసుకపల్లిలోని పేదలకు రెండు వేల ఎకరాల భూమిని పంచాలని వ్యవసాయ కార్మిక ఎర్రజెండాలను పాతించారని గుర్తుచేశారు. ప్రజాసమస్యలపై అలుపెరగని పోరాటం చేశారన్నారు. అక్షరాస్యత, సారా వ్యతిరేక ఉద్యమాల్లోనూ చురుగ్గా పాల్గొన్నారని కొనియాడారు. సీపీఎం నాయకులు బత్తల చిన్నతిరుపాలు, పెద్ద తిరుపాలు, బత్తల ఎరుకులయ్య సతీమణి బత్తల బాల గురవమ్మ, ఆశా యూనియన్ నాయకులు బీ భారతి, రాజబాబు , గిరి , నాగరాజు నాగేంద్ర పాల్గొన్నారు.

దివ్యాంగులకు ట్రైసైకిళ్ల పంపిణీ



అనుమసముద్రంపేట: మండలంలోని ఇద్దరు దివ్యాంగులకు ట్రైసైకిళ్లను వీపీఆర్ ఫౌండేషన్ సాయంతో జనసేన నాయకులు గురువారం పంపిణీ చేశారు. జనసేన మండల కన్వీనర్ సయ్యద్ అక్బర్‌బాషా, నాయకులు దాడి భానుకిరణ్, పత్తిపాటి ప్రవీణ్, గద్దం వంశీ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అలఘునాథుని పుష్కర కుంభాభిషేకం



వెంకటేశ్వరస్వామి కల్యాణ ఘట్టం నృత్య ప్రదర్శన



అలఘునాథస్వామి కల్యాణోత్సవం



శివాలయం వద్ద నుంచి పవిత్ర జలాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న మహిళలు



ఆత్మకూరు: పట్టణంలోని పురాతన శ్రీదేవి, భూదేవి సమేత అలఘునాథస్వామి ఆలయంలో పుష్కర కుంభాభిషేక మహోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. తొలుత మహిళలు శివాలయం వద్ద నుంచి పుణ్యజలాలను కలశాల్లో తీసుకుని ఊరేగింపుగా అలఘునాథస్వామి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం గత రెండు రోజులుగా విశేష పూజలు, హోమాలు నిర్వహించిన మంత్రజల కలశాలను పలువురు దంపతులు చేతబట్టి ఆలయ శిఖరంపైకి చేరుకుని వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ అభిషేకం చేశారు. ఆ తరువాత మహిళలు తీసుకొచ్చిన పుణ్యజలాలను అభిషేకం చేసి కుంభాభిషేక మహోత్సవాన్ని పూర్తి చేశారు.

నేత్రపర్వంగా కల్యాణోత్సవం

పుష్కర కుంభాభిషేక మహోత్సంలో భాగంగా అలఘునాథుని ఆలయంలోని కల్యాణ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత అలఘునాథస్వామి కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. దేవదేవేరుల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి కల్యాణ వేదికపై కొలువుదీర్చి సంప్రదాయబద్ధంగా కల్యాణాన్ని జరిపారు. మధ్యాహ్నం దాత కంచి పరమేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో భారీస్థాయిలో అన్నప్రసాద వితరణ చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా అపర్ణ ఆధ్వర్యంలో శ్రీభారతి సంగీత నృత్య విద్యాలయం చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు, సంగీత విభావరి భక్తులను అలరించాయి. కాగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దంపతులు, జెడ్పీ మాజీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. కల్యాణోత్సవానికి ఉభయకర్తలుగా పరమేశ్వరరెడ్డి, కాటంరెడ్డి రవీంద్రరెడ్డి, సోమిశెట్టి ప్రసాద్ దంపతులు వ్యవహరించారు. ఆలయ, కుంభాభిషేక కమిటీ సభ్యులు కుడుముల సుధాకర్‌రెడ్డి, సోమవరపు యానాదిరెడ్డి, పెళ్లూరు వెంకటేశ్వర్లు, తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.